మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# నిరంతరంగా అభివృద్ధి కార్యక్రమాలు

### మల్లేపల్లి రోడ్ కం డ్యామ్ నిర్మాణానికి మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన


రోడ్ కం డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి

**నారాయణ పేట, మే 6 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఉట్కూరు మండలం మల్లేపల్లి గ్రామానికి వెళ్లే పిడబ్ల్యుడి రహదారిపై నిర్మించనున్న రోడ్ కం డ్యామ్‌కు రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని అన్నారు. ఒకప్పుడు ఎన్నికల సమయంలోనే పనులు జరిగేవని, ఇప్పుడు నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మల్లేపల్లి వద్ద రూ.2 కోట్ల వ్యయంతో 60 పైపులతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, చిన్నపొర్ల-పెద్దపొర్ల మధ్య 40 పైపులతో వంతెన నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. సాంకేతిక నైపుణ్యంతో ఈ వంతెన నిర్మాణం చేపడుతున్నామని, వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. తాము ఫోటోలు, ప్రచారం కోసం కాకుండా బాధ్యతగా పనులు చేస్తున్నామని స్పష్టం చేసిన మంత్రి, నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఇక నారాయణపేట మక్తల్ మధ్య రూ.210 కోట్లతో 4లేన్ రహదారి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. మండలంలోని ఆవుసులోని పల్లి, మాక్దూమ్‌పురం గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా ప్రకటించేందుకు ఫైల్ సిద్ధం చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ప్రతి గ్రామానికి రేషన్ దుకాణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు అందించామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదన కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, మండల అధ్యక్షుడు విగ్నేశ్వర్ రెడ్డి, మల్లేపల్లి సర్పంచ్ కథలప్ప, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలపడితేనే అభివృద్ధి

**రాష్ట్రంలో ఒక ప్రధాన కేంద్రంగా మహబూబ్ నగర్ ఫస్ట్**

**ఇప్పటివరకు 2,000 మంది మహిళలకు శిక్షణ**

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 6 ప్రభాత వార్త :** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడితేనే సమాజం సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని బికె రెడ్డి కాలనీలో గల మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణా కేంద్రంలో నిర్వహించిన 5వ బ్యాచ్ నైపుణ్య శిక్షణ స్టడీ మెటీరియల్స్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందుతున్న మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ శిక్షణా కేంద్రం తెలంగాణ రాష్ట్రంలో ఒక ప్రధాన కేంద్రంగా నిలుస్తోందని, దీనికి కారణం ఇక్కడ పనిచేస్తున్న నిర్వాహకులు, టీచర్లు, సిబ్బంది అందరి సమిష్టి కృషేనని అభినందించారు. ఇంకా అభివృద్ధి సాధించేందుకు పరస్పరం చర్చించుకుని ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుతం దేశం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న నేపథ్యంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మహిళలు స్వయం సమృద్ధిగా నిలబడితే కుటుంబం బలపడుతుందని, దాంతో సమాజం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ బ్యాచ్‌లో సుమారు 400మంది మహిళలు గృహిణులు, విద్యార్థులు వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఎంఎస్ ఆఫీస్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి కోర్సుల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని చెప్పారు. ఇక్కడ ప్రాథమిక కోర్సులు నేర్చుకున్న తర్వాత టాస్క్ వంటి సంస్థలలో అడ్వాన్స్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కంప్యూటర్, లాంగ్వేజ్, డిజిటల్ స్కిల్స్, అకౌంటింగ్ (డీసీఏ , టాలీ వంటి) నేర్చుకునే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ నైపుణ్యాలను ఉపయోగించి స్వయం ఉపాధి దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రత్యేకంగా చిన్న పిల్లలు ఉన్న గృహిణులు కూడా శిక్షణ పొందేలా పిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం ఈ సెంటర్ ప్రత్యేకతగా నిలిచిందని తెలిపారు. మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు ఐదు బ్యాచ్‌ల ద్వారా దాదాపు 2,000 మంది మహిళలు శిక్షణ పొందారని, వారిలో చాలా మంది బ్యాంకు రుణాలు తీసుకుని స్వయం ఉపాధి ద్వారా తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారని చెప్పారు. మహిళలు ఇంటి బయటకు వచ్చి ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం కావాలని, తమపై నమ్మకం పెంచుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని స్పష్టం చేశారు. ఇది ముగింపు కాదని, ఒక కొత్త -మిగతా4లో..

# విద్యతోనే సమాజ అభివృద్ధి

- గ్రామీణ విద్యార్థులకు రవాణా సౌలభ్యం
- ఎంపీ మల్లు రవి చొరవతో విద్యార్థుల సంక్షేమానికి ప్రోత్సాహం

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

**ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి**

**పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి**


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎంపి మల్లురవి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 06 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు విద్యను కొనసాగించడంలో ఎదుర్కొనే ప్రధాన సమస్యలలో ఒకటి రవాణా సౌకర్యమని, ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు, సైకిళ్లు అందించడం ద్వారా విద్యార్థులు పాఠశాలకు సమయానికి హాజరు కావడంతో పాటు, వారి విద్యపై ఆసక్తి మరింత పెరుగుతుందని ఎంపీ మల్లురవి అభిప్రాయపడ్డారు. బుధవారం నాగర్‌కర్నూల్ ఐడిఓసి కార్యాలయ ఆవరణలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే కుమ్మెర, పెద్దాపూర్, గన్యాగుల, మంతటి, గగ్గలపల్లి, నార్లాపూర్, పాఠశాలల విద్యార్థులకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ప్రత్యేక చొరవతో, జిందాల్ స్టీల్ పవర్ సంస్థ సౌజన్యంతో సిఎస్ఆర్ నిధుల ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి పూర్తి చేసిన 130 మంది విద్యార్థులు, విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీని కార్యక్రమాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి లతో కలిసి ఎంపీ డాక్టర్ మల్లు రవి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా కుమ్మెర గ్రామ విద్యార్థులు 48 మంది విద్యార్థులకు, ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి కలిసి విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందని అందుకు కృషి చేసిన విద్యార్థులకు అధికారులను ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంగన్వాడి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం సైతం అందించేందుకు కసరతులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిందాల్ స్టీల్ పవర్ సంస్థ సిఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా సమాజానికి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా సంస్థ ఇలాంటి కార్యక్రమాలను విస్తరించాలని కోరారు. ప్రభుత్వం విద్యా ర్థుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటితో పాటు ప్రైవేట్ సంస్థల సహకారం ఉంటే విద్యా రంగం మరింత బలపడుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సైకిళ్లు అందడం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు, చదువులో మంచి ఫలితాలు సాధించే అవకాశాలు ఎక్కువవుతాయని, విద్యార్థులు తమ లక్ష్యా లను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని ప్రతిరోజు పాఠశాలకు హాజరుకావాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మొట్టమొదటిగా నాగర్‌కర్నూల్ నియోజకవర్గం పరిధిలోని విద్యార్థులకు అందజేయడం చాలా సంతోషించదగ్గ విషయమని ఆయన ఎంపీకి సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8, 9 ,10,వ తరగతి విద్యార్థులకు షూ అందజేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయాలని ఎంపీని కోరగా, అందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ సిఎస్ఆర్ నిధులతో విద్యార్థులకు అవసరమైన షూను అందజేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎంపీ తెలిపారు. సైకిళ్ల ద్వారా విద్యార్థులు సులభంగా పాఠశాలకు వెళ్లగలరని, తద్వారా వారి చదువు అంతరాయం లేకుండా కొనసాగుతుందని గ్రామీణ విద్యార్థులు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించే దిశగా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఇలాంటి సహాయం అందించిన ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిందాల్ స్టీల్ పవర్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. సైకిళ్లు తమ చదువుకు ఎంతో ఉపయోగపడతాయని, ఇకపై మరింత కృషి చేసి మంచి ఫలితాలు సాధిస్తామని విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, జింగల్ సంస్థ ప్రతినిధి రెడ్డి నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారులు షర్ఫుద్దీన్, వెంకటేశ్వర్లు శెట్టి , పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ చేస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

# ప్రభంజనమై తరలుదాం

**ప్రధాని సభను సక్సెస్ చేద్దాం**

**మూడు రాష్ట్రాల్లో బిజెపి ఘనవిజయం**

**పశ్చిమబెంగాల్ గెలుపు కీలకం**

**పాలమూరు కాషాయ దళానికి టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పిలుపు**

**మహబూబ్‌నగర్, మే 6 ప్రభాతవార్త :** మే 10న ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణకు అందులోనూ హైదరాబాదుకు రానున్న నేపథ్యంలో పాలమూరు నుంచి ప్రభంజనంలా జనాలు తరలివచ్చి మోడీసభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పిలుపునిచ్చారు. మోదీ టూర్‌పై బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ టూర్ జిల్లా ఇంచార్జ్ టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పాల్గొని మాట్లాడారు. జిల్లా స్థాయి, మండల స్థాయి, జిల్లా మండల స్థాయి బాధ్యులతో సమీక్ష నిర్వహించి, భారీ జన - మిగతా4లో..



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జానకి

# పటిష్టమైన భద్రతా వ్యవస్థ అవసరం

**సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**మొబైల్ అలర్ట్ సిస్టమ్స్, యాక్సెస్ కంట్రోల్ తప్పనిసరి**

**మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి**

**బంగారు దుకాణాల యజమానులు, స్వర్ణకారులకు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహణ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 6 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పట్టణంలోని విరాట్ విశ్వకర్మ సహకార సంఘం కార్యాలయంలో బులియన్ మార్కెట్ స్వర్ణకారులు సంఘం సభ్యులతో కలిసి బంగారు దుకాణాల యజమానులు, స్వర్ణకారులకు భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డి.జానకి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బంగారు దుకాణాలు, స్వర్ణకారుల - మిగతా4లో..

# ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించండి

### రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.జి.చిన్నారెడ్డి


రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మే 6 ప్రభాతవార్త:** భారత దేశంలో బాగా ప్రాధాన్యత ఉన్న వాణిజ్య పంటలను సాగు చేసి అత్యధికంగా లాభాలు పొందాలని, వరికి ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నా రెడ్డి రైతులకు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం స్థానిక దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో జిల్లా ఉద్యానవనాలు, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంటల మార్పిడిపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో పాటు ప్రణాళికా సంఘం అధ్యక్షులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. జి. చిన్నా రెడ్డి మాట్లాడుతూ 140 కోట్ల మంది జనాభా కలిగిన భారత దేశంలో ప్రజలకు అవసరమైన మేరకు ఆయిల్ గింజలు, పప్పు దినుసులు లేవని వాటిని ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకొవటానికి మన ఫోరెన్సిక్ నిల్వలు బయటి దేశాలకు వెళ్లిపోతున్నాయని చెప్పారు. అందుకే మన దేశంలోనే ఆయిల్ గింజలు సాగు చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. నూనె గింజల్లో అత్యధికంగా ఆయిల్ వచ్చే పంట కేవలం పామాయిల్ పంటకే ఉందని, అత్యధికంగా లాభసాటి పంట ఏదైనా ఉందంటే అది పామాయిల్ పంట అని కొనియాడారు. అందుకే రైతులు వరి పంట కాకుండా పామాయిల్, పప్పు గింజలు, కూరగాయల వైపు దృష్టి మళ్లించాలని సూచించారు. తన 90 ఎకరాల పొలంలో 75 ఎకరాలు పామాయిల్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రైతులు తమ భూములను సారవంతంగా ఉంచుకొని వరికి బదులు ప్రత్యామ్నాయ పంటల వైపు అవగాహన కల్పించడానికి ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రైతు భూ సారర కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని అదేవిధంగా ప్రతి ఒక్కరు రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) లో సభ్యత్వం తీసుకోవాలని తద్వార కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే అనేక పథకాలకు అర్హత సాధిస్తారని సూచించారు. అదేవిధంగా ప్రతి రైతు కిసాన్ క్రెడిట్ కార్డు పొందటం, సహకార సంఘంలో సభ్యత్వం తీసుకోవడం వంటివి చేయాలని చెప్పారు. పామాయిల్ పంట వేసుకునేందుందుకు ముందుకు వచ్చే రైతులకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి పామాయిల్ సాగు చేస్తున్న రైతుల వద్దకు తీసుకువెళ్లి అవగాహన కల్పిస్తామని చెప్పారు. రైతులు వరి మాత్రమే కాకుండా ఇతర పంటల సాగు వైపు దృష్టి సారించాలని కోరారు. రైతు కమిషన్ సభ్యురాలు భవాని రెడ్డి, ప్రత్యేక నోడల్ అధికారి ప్రసాద్ రావు, మాజీ జాయింట్ డైరెక్టర్ వ్యవసాయ శాఖ కృపాకర్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి, వీణా, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి విజయ్ భాస్కర్, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, తహసిల్దార్ రమేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమంలో సహకార సంఘాల పాత్ర కీలకం

- యూరియా వినియోగాన్ని తగ్గిస్తేనే నేల సంరక్షణ
- భిన్నమైన పంటలు సాగు చేసి రైతులు ఆర్థికంగా ఎదగాలి
- ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘకాలిక ప్రయోజనాలు
- రైతు సంక్షేమ వారోత్సవాల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



నేలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, తదితరులు

**గద్వాల మే 6, ప్రభాతవార్త :** రైతులు ఒకే పంటను కాకుండా భిన్నమైన పంటలు సాగు చేస్తే ఆర్థికంగా ఎదగవచ్చని, ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రైతు సంక్షేమ వారోత్సవాల్లో బుధవారం గద్వాల పిఎసిఎస్‌లో సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేందుకు సహకార సంఘాల కృషి ఎంతో ఉందని, రైతుల సంక్షేమానికి రుణాలు ఇవ్వడం, సబ్సిడీకి విత్తనాలు, ఎరువులు అందజేయడం జరుగుతుందన్నారు. కొద్ది రోజుల కిందట జిల్లాలోని రైతులకు కొరత లేకుండా యూరియాను సరఫరా చేయడంలో ఆయా మండలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రధాన పాత్ర పోషించాయని కొనియాడారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు ప్రతి పిఏసిఎస్‌కు 100 ఎకరాల లక్ష్యాన్ని నిర్దేశించినందున సంఘాల సభ్యులు సాగు చేసేందుకు సహకరించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆయిల్ పామ్ పంట సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్ పంటను మూడేళ్ల పాటు జాగ్రత్తగా పెంచితే దాదాపు 25 ఏళ్ల పాటు ఫలితాలు పొందవచ్చన్నారు. జిల్లాలోని గ్రౌండ్ వాటర్ నివేదికను ఇటీవల పరిశీలిస్తే నైట్రేట్ శాతం ఎక్కువగా ఉన్నట్లు తెలిసిందన్నారు. యూరియాను అవసరానికి మించి వాడడం వలన నీళ్ల కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, రైతులు నానో యూరియా పై దృష్టి సారించాలని సూచించారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని నేలను కాపాడుకోవాలంటే ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లా పిఎండిడికేపైకు ఎంపికవడంతో రైతులు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో చెప్పుకోదగ్గ ప్రగతి సాధించే అవకాశం ఉందన్నారు. సంప్రదాయ పంటలే కాక మిల్లెట్స్, ఉద్యాన తోటలపై, పశుపోషణపై దృష్టి సారిస్తే ఆర్థికంగా - మిగతా4లో..

# మట్టి అక్రమ రవాణా టిప్పర్లను పట్టుకున్నారు.. వదిలేశారు..


అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు

**దేవరకద్ర, మే 6 ప్రభాతవార్త:** ప్రభుత్వ భూమిలో మట్టి అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నప్పటికీ తర్వాత వదిలేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. బుధవారం దేవరకద్ర మండలం పెద్ద గోపులాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారని కొంతమంది రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో దేవరకద్ర తహసిల్దార్ హర్షద్ సూచన మేరకు ఆర్ఐ శరత్ నాయక్, జిపిఓ రాజులు కలిసి పెద్ద గోపులాపూర్ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 87 దగ్గరకు వెళ్లారు. అక్కడ వెళ్లి పరిశీలించగా దాదాపు 5 భరత్ బెంజ్ టిప్పర్లు, హిటాచీలు ఉన్నాయి. ప్రభుత్వ భూమి మొత్తం 55 ఎకరాలు ఉండడంతో కొంతమంది మట్టి మాఫియా వారు బెంజుల ద్వారా మట్టిని విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ, మట్టి తరలిస్తున్న పలు టిప్పర్లను అడ్డుకున్నారు. అయితే కొంత సేపటికి తర్వాత అనూహ్యంగా ఆ టిప్పర్లను వదిలివేయడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్థానికులు ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇటువంటి సంఘటనలు పునారావృతం కాకుండా చూడాలని స్థానికులు, ప్రజలు, డిమాండ్ చేస్తున్నారు. అక్రమ టిప్పర్లను బెంజులను, ఎలాంటి అడ్డంకులు లేకుండా సాఫీగా వదిలేసినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించడం మరింత వివాదానికి దారి తీసింది.

# లారీ ,డీసీఎం, బస్సు ఢీకొని వ్యక్తి మృతి, పలువురికి గాయాలు

### సంఘటన స్థలాన్ని పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి


మృతి చెందిన లారీ డ్రైవర్

**దేవరకద్ర, మే 6 ప్రభాతవార్త :** లారీ, డీసీఎం, బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. దేవరకద్ర ఎస్ఐ నాగన్న తెలిపిన వివరాల ప్రకారం దేవరకద్ర మున్సిపాలిటీపరిధిలోని పెద్దగోప్లాపూర్ రాయచూర్ రహదారిపై ఉన్న స్పీడ్ బ్రేకర్ల దగ్గర హైదరాబాద్ నుండి సిందనూర్‌కు ట్రాన్స్‌పోర్ట్ లోడుతో వెళ్తున్న డీసీఎంను రాయచూరు వైపు - మిగతా4లో..

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

**లింగాల,మే 6, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో మృతి చెందిన బాధిత కుటుంబానికిపరామర్శించి ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. అప్పాయి పల్లి గ్రామంలో అతినారపు బాలస్వామి మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలోని మనం మన భాద్యత సభ్యులు బాధితుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు, 25 కెజిల బియ్యంను 9వ వార్డు సభ్యులు గోస్కె నరేష్ అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చిన ఆదుకోవడానికి మనం మన బాధ్యత, మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం, బియ్యంను అందజేస్తున్నట్లు వెల్లడించారు. పేద కుటుంబంలో ఎవరైనా మృతిచెందితే వారి కుటుంబ సభ్యులకు మనం మన బాధ్యత లో భాగంగా ఆర్థిక సహాయం అందజేయడం స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామచందర్, వార్డు సభ్యులు యాదగిరి సలేశ్వరం, నెల్లికుదురు నరేష్,రాజు, సురేందర్ రావు, శశిధర్, నిరంజన్, గోవర్ధన్, అశోక్, నవీన్, శ్రీశైలం, మహేష్ ,శేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మంత్రి

**నారాయణపేట, మే 6 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో నిర్వహించిన పలు వివాహ వేడుకలకు రాష్ట్ర క్రీడా, పాడిపరిశ్రమ అభివృద్ధి, పశు సంవర్ధక శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆర్టీసీ కండక్టర్ కుమార్తె వివాహం సందర్భంగా గాయత్రి ఫంక్షన్‌హాల్‌లో జరిగినవేడుకలో పాల్గొన్న మంత్రి,వధూవరులకు ఆశీస్సులు అందజేశారు. వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖశాం తులతో నిండాలని కోరుకున్నారు. వివాహం అనేది రెండు కుటుంబాలను కలిపే పవిత్ర బంధమ ని, పరస్పర గౌరవం, సహకారంతో జీవితం విజయవంతంగా సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివకుమార్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ రాంపురం శివారెడ్డి, మాధవ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బిజెపి కౌన్సిలర్ సత్యపాల్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకకు హాజరైన మంత్రి

## నామినేటెడ్ పదవుల్లో మదాసి కురువలకు అన్యాయం



**ధన్వాడ, మే 6 ప్రభాతవార్త :** రాష్ట్రంలో నామినేటెడ్ కార్పొరేషన్ పదవుల రెండో విడత పంపకాల్లో మదాసి కురువలకు ప్రాతినిధ్యం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. మదాసి కురువ సంఘం ధన్వాడ మండల ప్రచార కార్యదర్శి కురువ నవీన్ విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఈ అంశంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో కలిపి సుమారు 6 నుంచి 8 లక్షల జనాభా ఉన్న మదాసి కురువ సమాజానికి ఒక్కనామినేటెడ్ పదవికూడా ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.కాంగ్రెస్ పార్టీకి ఈ వర్గం కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే కనిపిస్తున్నదా అని ప్రశ్నించారు.పాత పాలమూరు జిల్లాలో గుర్తింపు పొందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి సన్నిహితుడు, ఆయన రాజకీయ శిష్యుడిగా పేరుగాంచిన మరికల్ కురువ రాఘవేందర్‌కు కూడా నామినేటెడ్ పదవి ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. 25 ఏళ్లకు పైగా రాజకీయ అనుభవం ఉన్న నాయకుడికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు.సామాజిక న్యాయం పేరుతో మదాసి కురువలను పక్కన పెట్టడం సరికాదని, ఈ అన్యాయంపై రాబోయే రోజుల్లో ఓటు అనే ఆయుధంతో తమ సత్తా చాటుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మదాసి కురువలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

## గన్ని బ్యాగుల కొరతతో రైతుల ఇబ్బందులు

**ధన్వాడ,మే 6 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని మందిపల్లి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బిఆర్ఎస్ నాయకులు సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో గన్ని బ్యాగుల కొరత, వడ్ల కొనుగోలులో ఆలస్యం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తమ పార్టీ హయాంలో వడ్ల కొనుగోలు సజావుగా సాగేదని, రైతులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి రాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్వహణ లోపాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. అలాగే రైతులు గంటల కొద్దీ ఎదురుచూడాల్సి వస్తోందని, గన్ని బ్యాగులు లేక వడ్లు నిల్వ ఉండిపోతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితిని వెంటనే సరిచేసి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## సహకార సంఘంలో సభ్యత్వ

## నమోదు,స్వల్ప,దీర్ఘకాలిక రుణాలపై అవగాహన

**ఉప్పునుంతల,మే 6 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 90 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మూడో రోజైన బుధవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం లో పాలకమండలి చైర్మన్ మడ్డు నరేందర్ రెడ్డిఅధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యత్వ నమోదు, స్వల్ప, దీర్ఘకాలిక రుణా పథకాలు, రైతు ఉత్పత్తి దారుల సంస్థ, కేంద్ర ప్రభుత్వపథకాలు అమలుపై చర్చించడం జరిగింది.ఈసమావేశానికి స్థానిక సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం విజయవంతంచేయాలని సీనియర్ ఇన్స్‌పెక్టర్ షేక్‌మహమ్మద్,సంఘ సిఇఒ కొత్తరవీందర్‌రావు, కార్యవర్గ సభ్యులు,జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు కట్టఅనంతరెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ కాల్వగోవర్ధన్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ తిప్పర్తి జగన్మోహన్ రెడ్డి, ఉప్పరి పల్లి మాజీ సర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి,గోవర్ధన్ రావు,రైతులు, సింగిల్ విండో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ప్రగతి ప్రణాళిక పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## పిఎసిఎస్‌లో కొలువు దీరిన పాలక మండలి

**తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు పాలక మండలి కొనసాగింపు**

**ఉప్పునుంతల,మే 6 ప్రభాతవార్త :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ( సింగిల్ విండో) పాలకమండలిగా చైర్మన్‌గా మడ్డు నరేందర్‌రెడ్డి ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు పాలకమండలి ఏర్పాటు చేయడం జరిగిందని సీఈఓ రవీందర్ రావు పేర్కొన్నారు. 15.02.2020లో ఏర్పడిన పాలక మండలి చైర్మన్‌గా సత్తు భూపాల్ రావు చైర్మన్ పదవి రాజీనామా చేయడంతో సహకార సంఘంలో ఉపాధ్యక్షులు లేనందున ప్రస్తుతం కార్యవర్గ సభ్యులు 9మంది ఉన్నారు.అందులో సీనియర్ కార్యవర్గ సభ్యుడైన మడ్డు నరేందర్ రెడ్డిని పిఎసిఎస్ చైర్మెన్ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎంపిక చేశారు. గతంలో రెండు పర్యాయాలు సింగిల్ విండో చైర్మన్ గా, డిసిసిబి డైరెక్టర్ గా పనిచేసిన అనుభవం ఉండడంతో మరోసారి సింగిల్ గా చైర్మన్ గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో సంఘ అభివృద్ధికి పాటుపడతానని, రైతులకు సహకార సంఘం అందించే సహకారాన్ని పూర్తి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో ఉన్న సంఘ సభ్యులు అందరు సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కొలువుదీరిన పాలకమండలి సభ్యులను శాలువా లు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ మడ్డు నరేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, సంఘ సిఇఒ కొత్త రవీందర్ రావు, సింగిల్ విండో డైరెక్టర్లు సూరం నారాయణరెడ్డి, సాయి బాబు, ఆలూరి శ్రీనివాసులు, నాయకులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.



కొలువు దీరిన ప్రాథమిక సహకార సంఘం పాలక మండలి

# వరి కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్**

**వనపర్తి రూరల్, మే 6, ప్రభాతవార్త :** యుద్ధప్రాతిపదికన వరి కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ అన్నారు.బుధవారం వనపర్తి మండలంలోని నర్సింగాయిపల్లి, కిష్టగిరి, నాచహళ్లీ, మేంటేపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకాలు, మౌలిక వసతులు, రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్ని బ్యాగుల సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత రాకుండా నిరంతరం నిల్వలను పర్యవేక్షించాలని పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే సంచుల్లో నింపి నిల్వ ఉంచేందుకు వీలుగా ప్రతి కేంద్రానికి తగినన్ని గన్నీ బ్యాగులను తక్షణమే అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే ధాన్యంలో తాలు, మట్టి లేకుండా రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని, ఇందుకు ప్యాడి క్లీనర్లను వినియోగించాలని ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.ధాన్యం త్వరగా క్లీనింగ్ చేయడానికి, రైతులు వేచి ఉండే సమయాన్ని తగ్గించడానికి ఆయా కేంద్రాల్లో అదనపు ప్యాడీ క్లీనింగ్ మిషన్లను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం తూకం పూర్తి కాగానే మిల్లులకు తరలించేందుకు వీలుగా సరిపడా లారీలను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఏ రోజుకారోజు ధాన్యం రవాణా జరగాలని, లారీల కొరత నెపంతో కొనుగోలు ప్రక్రియ నిలిచిపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్

# రైతులు లాభదాయక పంటలపై దృష్టి సారించాలి

**రైతు వారోత్సవాల్లో వ్యవసాయ మార్కెట్ పాలక వర్గ సభ్యులు**

**నవాబుపేట, మే 5 ప్రభాతవార్త :** రైతులు పంట మార్పిడి చేసి లాభాదాయకమైన పంటలపై దృష్టి సారించాలని ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ని మార్కెట్ యార్డ్ లో నిర్వహించిన రైతు వారోత్సవంలో వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సభ్యులు చైర్మన్ హర లింగం, వైస్ చైర్మన్ తులసి రామ్ నాయక్, సర్పంచ్ గీతారాణి లు అన్నారు. గతంలో పెసర్లు, జొన్నలు, కందులు తదితర పంటలు పండించిన రైతులు ఇప్పుడు ఎక్కువగా వరిపంటపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. ఇది రైతులకు లాభదాయకం కాదన్నారు. పంట మార్పిడి చేసి, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసుకొని లాభాలు పొందాలన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయాలని, భూసారాన్ని కాపాడేందుకు యూరియాను తగ్గించాలన్నారు. పంట అవశేషాలను కాల్చడం మానుకోవాలన్నారు. వచ్చే ఏడాది ఎలిగేడు మండలంలో కనీసం వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఐదేళ్ల క్రితం రూ.14 వేలుగా ఉన్న దర ప్రస్తుతం రూ.23 వేల వరకు పెరిగిందని తెలిపారు. భవిష్యత్‌లో కూడా ధరలు పెరుగుతాయని, దేశంలో నూనె దిగుమతులపై ఆధారపడుతున్నందున ఆయిల్‌పామ్‌కు మంచి మార్కెట్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హరి లింగం, వైస్ చైర్మన్ తులసిరాం నాయక్, సర్పంచ్ గీతారాణి శివకుమార్, పలు గ్రామాల డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



రైతు వారోత్సవాలలో పాల్గొన్న వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సభ్యులు

### ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పంట మార్పిడితో

# రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

**దేవరకద్రలో రైతు వారోత్సవాలు**

**దేవరకద్ర, మే 6 ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల్లో భాగంగా రైతు వారోత్సవాలు సోమవారం దేవరకద్ర మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో మార్కెట్ అధికారులు,సహకార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతుల సంక్షేమం, ఆదాయ వృద్ధి, లక్ష్యంగా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుండగా వాటి వివరాలను ఈ వారోత్సవాల ద్వారా రైతులకు చేరవేస్తున్నారు. విత్తనాల ఎంపిక ఎరువుల వినియోగం పంటల సంరక్షణ నీటి నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణాలు కూడా ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం చేపడుతున్న రైతు భరోసా వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, రసీదులు తప్పకుండా కొనుగోలు చేసిన విత్తనాలకు తీసుకోవాలని, పంట మార్పిడి చేయాలని, జీవన ఎరువులు వాడాలని, యాసంగి లో తెలంగాణ సోనా దొడ్డు రకం వేస్తూ భూమి సారాన్ని పెంపొందించేలా వ్యవసాయాన్ని చేయాలని చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు ప్రజాప్రతినిధులు రైతులతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. రైతులు సాంకేతికతను అంగీకరించి అధిక దిగుబడులు సాధించాలని పిలుపునిస్తున్నారు.సహకార బ్యాంక్ అధికారులు దమయంతి మరియు యూసుఫ్ మాట్లాడుతూ సహకార బ్యాంకులు గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సులభంగా వ్యవసాయ రుణాలు అందిస్తూ కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా పంటల సాగుకు అవసరమైన తక్షణ ఋణాలు దీర్ఘకాలిక పెట్టుబడి రుణాలు రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా సహకార బ్యాంకులు, రాష్ట్ర సహకార బ్యాంకులు మూడు స్థాయిల వ్యవసాయ వ్యవస్థ ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. ఈ వ్యవస్థ గ్రామీణ అభివృద్ధికి రైతుల ఆర్థిక స్థితి మెరుగుదలకు తోడ్పడుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైటస్ పాల్, దమయంతి, యూసుఫ్, మున్సిపల్ చైర్మన్ దమయంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, మార్కెట్ కార్యదర్శి జయలక్ష్మి, గోపాల్, ఎంపీడీవో శ్రీనివాసరావు, తాహసిల్దార్ హర్షద్, దేవరకద్ర ఏవో రాజేందర్ అగర్వాల్, కౌకుంట్ల ఏవో శివ కుమార్, సీఈఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



రైతు వారోత్సవాల్లో మాట్లాడుతున్న నాయకులు

# పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు

**గద్వాల మే 06, ప్రభాత వార్త :** శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణా సంస్థలో 2026.27కు పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు అర్హత గల బాలికల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.హైదరాబాద్ నందు 3 సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులకు 2026.27 విద్యా సంవత్సరానికి తల్లిదండ్రుల కోల్పోయిన అనాథ బాలికలు, నిరాశ్రయులు,చైల్డ్ హోమ్స్ /మహిళా సంస్థలలో ఉన్న బాలికలు,అక్రమ రవాణాకు గురైన బాధితులు మరియు దివ్యాంగ బాలికలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈ సంస్థలో సివిల్,ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్,ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్,సెమీకండక్టర్ టెక్నాలజీ,ల్యాండ్‌స్కేప్ డిజైన్ వంటి డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయని,ప్రతి కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయని చెప్పారు.ఈ మొత్తం సీట్లలో 70శాతం సీట్లు అనాథ మరియు నిరాశ్రయ బాలికలకు కేటాయించబడినట్లు,అలాగే 3 సీట్లు దివ్యాంగులకు కేటాయించినట్లు తెలిపారు. అర్హతగా కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత ఉండాలని, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.ఎంపికైన అభ్యర్థులకు ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం కూడా కల్పించబడుతుందని తెలిపారు. కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు (అనాథలకు మినహాయింపు), తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రం,సంబంధిత సంస్థ నుండి బోనఫైడ్ సర్టిఫికేట్,టీసీ,అధ్యయన ధృవీకరణ పత్రం,పదవ తరగతి మార్కుల మెమో సమర్పించాలన్నారు.అభ్యర్థులు అవసరమైన ధృవీకరణ పత్రాలతో పాటు పూర్తి చేసిన దరఖాస్తులను మే 25,2026లోగా హైదరాబాద్‌లోని డైరెక్టర్, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ 83222,మధురానగర్, సారథి స్టూడియో సమీపంలో, యూసఫ్ గూడ,అమీర్‌పేట్, హైదరాబాద్ -500038 కార్యాలయానికి పంపించాలని సూచించారు.మరిన్ని వివరాలకు గద్వాల పాత కలెక్టరేట్‌లోని బాలరక్షా భవన్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

# రైతును రాజుగా మార్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా**

**ఆత్మకూర్ మే6, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైతులను రాజుగా మాత్రమే కాంగ్రెస్ పార్టీ ప్రథమ కర్తవ్యం గా భావిస్తుందని ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా సింగిల్విండో చైర్మన్ గాడి కృష్ణమూర్తి తదితరులు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక రైతు మహోత్సవంలో భాగంగా బుధవారం రోజు మున్సి పల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గత శాసనసభ ఎన్నికల సమయంలో రైతులకు గిట్టుబాటు ధర అందించడమే కాకుండా వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ ప్రకటించి రైతు సమాజంలో తల ఎత్తుకొని తిరిగేలా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుందని అందులో భాగంగానే ప్రస్తుత రబీ సీజన్ కు సంబంధించి కూడా కృష్ణా నది పరివాహక ప్రాంతంలో గల ప్రతి గ్రామంలో వరి ధాన్యం వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచిందని వారు పేర్కొన్నారు. రైతులు దళారీలను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే వరి ధాన్యాన్ని విక్రయించాలని రైతులకు వారం రోజుల్లోనే నగదు జమ చేసేందుకు ప్రభుత్వ అన్ని రకాల చర్యలు తీసుకుందని వారు విజ్ఞప్తి చేశారు. ఆత్మకూర్ మార్కెట్ యార్డు అభివృద్ధి కోసం మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి అండదండలతో ఇప్పటికే నూతన భవన సముదాయం కోసం నిధులు కేటాయించడం జరిగిందని మార్కెట్ యార్డ్ ఆవరణలో రైతులకు అన్ని వసతులు ఏర్పాటు చేసేందుకు అభివృద్ధి పనులకు త్వరలోనే శ్రీకారం చుట్టాలునట్లుగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కార్యదర్శి నర్సింలు సింగిల్ విండో సీఈవో నరేష్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విష్ణు, రవికాంత్, గోవర్ధన్, ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్లు కోట్ల తిరుపతయ్య తదితరులతో పాటుగా పలువురు నాయకులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా

## పేదల సంక్షేమం కోసమే

## రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

**మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు**

**అచ్చంపేట, మే,6 ప్రభాతవార్త:** నిరుపేదల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ఆదేశాల మేరకు భూమి పూజ చేశారు. వై జంక్షన్ వద్ద రాజ్‌పుత్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదేవిధంగా పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని నిరుపేదలకు సొంత ఇంటి కల సహకారమయ్యే విధంగా పనులు పూర్తి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు వివిధ వార్డుల కౌన్సిలర్లు, కార్యకర్తలు, రాజ్‌పుత్ సంఘ నేతలు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్

## రుణాల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

**నవాబుపేట, మే 5 ప్రభాతవార్త :** ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు అర్జీ పెట్టుకున్న దరఖాస్తుదారులకు నేడు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మండల అధికారి ఎంపీడీవో జయరాం నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రభుత్వం త్రి వీలర్స్ టూ వీలర్స్ పాడి పశువులకు లోన్ సదుపాయాల కోసం అర్జీలు పెట్టుకున్న దరఖాస్తుదారులు నేడు మండల ఎంపీపీ కార్యాలయంలో మౌఖిక పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అర్జీదారులు కలెక్టర్ ఆఫీసులో రుణాల కోసం సంబంధించిన ధ్రువపత్రాలు రెండు సెట్లు జిరాక్సు తీసుకొని ఆధార్ కార్డు తో పాటు తీసుకొని మధ్యాహ్నం రెండు గంటలకు హాజరుకావాలని తెలిపారు.

## శాంతియుతంగా బక్రీద్ జరుపుకోవాలి

**డీఎస్పీ పల్లె శ్రీనివాసులు**




మాట్లాడుతున్న డీఎస్పీ పల్లె శ్రీనివాసులు

**అచ్చంపేట, మే,6 ప్రభాతవార్త :** బక్రీద్ పండుగను మత సామరస్యంతో, శాంతియుతంగా జరుపుకోవాలని అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాసులు సూచించారు. బుధవారం పట్టణంలో పోలీస్ స్టేషన్ ఆవరణంలో ముస్లిం సోదరులకు శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకూడదని కోరారు. భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ జరుపుకోవాలని శాంతి సందేశం ఇచ్చారు. పండుగ వేళ కొన్ని నిబంధనలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్సై సద్దాం హుస్సేన్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

**సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు**

**ఉప్పునుంతల,మే 6 ప్రభాతవార్త :** నేడు ఉప్పునుంతలలో వరి ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని టిపిసిసి ఉపాధ్యక్షుడు,నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు గ్రామ సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ మడ్డు నరేందర్ రెడ్డి సహకారంతో సంఘ సిఇఒ కొత్త రవీందర్ రావు సౌజన్యంతో కట్ల బండ సమీపంలో ఉన్న గోదాం వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్ వివరించారు.ఈకార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ హాజరవుతున్నందున రైతులు, సహకార సంఘం సభ్యులు, పాలకమండలి డైరెక్టర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు కోరారు.

## ముగిసిన గజలమ్మ జాతర మహోత్సవాలు



గజలమ్మ జాతర ముగింపు మహోత్సవాలలో భక్తులు

**దామరగిద్ద, మే 6 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహించిన శ్రీ గజలమ్మ జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. జాతరలో భాగంగా రెండవ రోజు బుధవారం పోలీ కార్యక్రమం సంప్రదా యబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుం భం పోసి,ఆలయం ప్రాంగణంలో అమ్మవారి చుట్టూ భక్తులు పోలీ చల్లారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అద్దన్ కనికిరె డ్డి, సత్తి సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు బక్క నర్స ప్పతో పాటు గజలప్ప, మాణిక్యప్ప, హనుమంతు, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

## ఈతకు వెళ్లే పిల్లలపై

## అప్రమత్తత అవసరం : ఎస్సై వెంకటేష్



**ధన్వాడ,మే6 ప్రభాతవార్త :** వేసవి కాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో చిన్న పిల్లలు చెరువులు, కాలువల్లో ఈతకు వెళ్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచి స్తున్నారు. పిల్లలు ఎప్పుడూ పెద్దల పర్యవేక్షణలోనే నీటిలోకి వెళ్లాలని, ఒంటరిగా వెళ్లనివ్వకూడదని హెచ్చరిస్తున్నారు. చెరువు ల్లో లోతు ఒక్కసారిగా పెరగడం, కింద మట్టి, రాళ్లు, గుంతలు ఉండే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. చిన్న పిల్లలకు లైఫ్ జాకెట్లు ఉపయోగించడం మంచిదని, నీటి ప్రవాహం, అలలు ఉన్న చోట్లకు వెళ్లనివ్వకూడదని ధన్వాడ ఎస్ఐ వెంకటేష్ గౌడ్ సూచించారు.

# రైతులు లాభసాటి పంటలపై అవగాహన కలిగి ఉండాలి

**• కిసాన్ క్రెడిట్ కార్డును ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి • వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**గోపాల్ పేట్, మే6, (ప్రభాతవార్త):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గోపాల్ పేట మండలం సహకార సంఘం ఆధ్వర్యంలో గోపాల్‌పేట రైతు వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే, 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు జిల్లాలో రైతు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, రైతు అనుబంధ శాఖలు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో రైతులకు పంట సాగు పై మెళకువలు, పంట మార్పిడి వల్ల లాభాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, బ్యాంకు రుణాలు తదితర అంశాల పై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. రైతులకు భూ ఆరోగ్య కార్డు (సాయిల్ హెల్త్ కార్డ్) ఇవ్వడం జరుగుతుందని, శాస్త్రజ్ఞులు రైతు పొలాన్ని పరిశీలించి భూమిలో ఉన్న సారం, భూమిలో నత్రజని, పోటాష్, భాస్వరం తదితర ఏ ధాతువు తక్కువ అయ్యింది, ఏది ఎక్కువ అయ్యింది అనేదానిపై అధ్యయనం చేసి అట్టి పొలంలో ఎలాంటి పంటలు వేసుకోవాలి, ఎలాంటి ఎరువులు ఎంత మోతాదులో వేయాలి అనే అంశాలను సాయిల్ హెల్త్ కార్డు ద్వారా రైతులకు తెలియపరచడం జరుగుతుందని తెలిపారు. అందువల్ల జిల్లాలోని రైతులు అందరూ సాయిల్ హెల్త్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, హాజరైన రైతులు

మోతాదుకు మించి యూరియా వాడటం వల్ల తాత్కాలికంగా మొక్కలు పచ్చగా ఏపుగా కనిపిస్తుంది కానీ ముద్దగా ఏర్పడి పంట దిగుబడి, నాణ్యత తగ్గిపోతుందని తెలియజేశారు. అదేవిధంగా కిసాన్ క్రెడిట్ కార్డు ప్రతి రైతు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకులో రైతులకు కేవలం 79 శాతం వడ్డీతో రుణాలు అందిస్తాయని, వాటిని సకాలంలో తిరిగి చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం ద్వారా 3 శాతం వడ్డీని తిరిగి రైతుకు చెల్లిస్తుందని చెప్పారు.ప్రతిసారి ఒకే రకమైన పంట వేయడం వల్ల భూమి సారం కోల్పోయి దిగుబడి తగ్గిపోతుందని అందువల్ల తరచుగా పంట మార్పిడి చేస్తూ ఉంటేనే భూమి సారవంతంగా ఉండి మంచి దిగుబడి ఇస్తుందన్నారు. భావితరాలకు సైతం మంచి సారవంతమైన భూమిని అందించాల్సిన బాధ్యత అందరూ రైతులపై ఉన్నదన్నారు. అందువల్ల కేవలం వరి పంట సాగు మాత్రమే కాకుండా వేరు సెనగ, పామాయిల్, కూరగాయలు తదితర వాణిజ్య పంటలు సాగుచేసుకొని రైతులు లాభాలు పొందాలని సూచించారు. జిల్లాలో గన్నీ బ్యాగుల కొరత రానివ్వబోమని, పశ్చిమ బెంగాల్లో ఎన్నికలు, పశ్చిమాసియాలో యుద్ధాల వల్ల గన్నీ బ్యాగుల సరఫరాలో కొంత జాప్యం జరిగిందని దీనిని త్వరలో అధిగమించడం జరుగుతుందన్నారు. ఈ రోజు రేవల్లి మండలానికి 10 వేల గన్నీ బ్యాగులు పంపించడం జరుగుతుందని, మిగిలిన మండలాలకు సైతం కొరత లేకుండా చేసే వరి, మొక్క జొన్న ధాన్యం కొనుగోలులో వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో గోపాల్‌పేట పిఏసిఎస్ చైర్మన్ ఎల్. రఘు, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద రావు, జిల్లా కో ఆపరేటివ్ అధికారి బి.రాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, నాబార్డ్ డిడియం. మనోహర్ రెడ్డి, ఎల్‌డియం శివకుమార్ సైతం రైతులకు వ్యవసాయ సాగు, రుణాల పై అవగాహన కల్పించారు. తహసిల్దార్ తిలక్, ఎంపీడిఓ గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల గ్రామాల సర్పంచులు, మండల వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపురం చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 6 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న వాహన రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆధునిక సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయడం చాలా అవసరమని పేర్కొన్నారు. ప్రజల భద్రత మరియు సౌకర్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, రాబోయే రోజుల్లో మరిన్ని కీలక కూడళ్ల వద్ద కూడా ఇలాంటి సదుపాయాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్తగా ప్రారంభమైన ట్రాఫిక్ సిగ్నల్స్‌తో నగరంలో ట్రాఫిక్ నిర్వహణ మరింత సమర్థవంతంగా మారుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్,ట్రాఫిక్ ఎస్ఐ కళ్యాణ్, టౌన్ ఎస్ఐ గోవర్ధన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు,డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మాధవ్‌రెడ్డి, డీసీసీకార్యదర్శి శ్రీనివాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్స్, అధికారులు, పోలీసులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

## పీఏసీఎస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

**బిజినేపల్లి, మే6 ప్రభాతవార్త:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల కొనసాగింపుపై ఉత్తర్వులు జారీ కావడంతో పీఏసీఎస్ చైర్మన్‌గా నాయినోళ్ల బాలరాజు గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘ పరిపాలన వ్యవస్థ నిర్వహణతోపాటు సహకార సంఘాల పరిధిలో కొనసాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వేగవంతమయ్యేలా చూస్తానన్నారు.గతేడాది డిసెంబర్ 14న జీవో 597 ద్వారా పీఏసీఎస్‌ల పాలక వర్గాలను తొలగించి, ప్రత్యేకాధికారులను నియమించి సహకారసంఘాల్లో పరిపాలన సాగించాలంటూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. ఈ నిర్ణయం సరిగా లేదని, రైతులకు తీవ్ర ఇబ్బందులు వస్తాయని సహకార సంఘాల నాయకులు, సభ్యులు ఆందోళన వ్యక్తం చేసి, 597 జీఓను సవాల్ చేస్తూ పాలకవర్గాల సభ్యులు రాష్ట్ర హైకోర్టునుఆశ్రయించినట్లు తెలిపారు. దాఖలైన పిటీషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం, కమిటీ సభ్యులనేకొనసాగించాలని సూచించడంతో తిరిగిబాధితులను స్వీకరించినట్లు వివరించారు. బాధ్యతలు స్వీకరించిన చైర్మన్‌ను ఆయా గ్రామాలరైతులు సన్మానించారు. కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ రవి,గంగన మోని నరసింహ, అనిల్ గౌడ్, మధుసూదన్, జుర్రు కృష్ణ, భగవంతు గౌడ్, వినీత్ గౌడ్,రాజు,పూర్ణాచందర్ గౌడ్, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరిస్తున్న నాయినోళ్ల బాలరాజు గౌడ్

## కోర్టు ఆదేశాలతో తిరిగి పీఏసీఎస్ చైర్మన్ కమిటీ పాలకవర్గం బాధ్యతలు



**కల్వకుర్తి, మే 6 ప్రభాతవార్త:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలక వర్గం గడువు ముగియడంతో సిఈఓతో కార్యాలయం పనులు కొనసాగుతున్నాయి. అయితే ఈ మధ్య కోర్టు ఆదేశాల మేరకు పీఏసీఎస్ చైర్మన్ కమిటీ సభ్యులు కొత్త పాలక వర్గం ఎన్నికయ్యే వరకు పాత పాలక వర్గం కొనసాగాలనే ఆదేశంతో పాత పాలక వర్గం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కోర్టు ఆదేశాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచనల మేరకు బాధ్యతలు చేపట్టినట్లు చైర్మన్ తలసాని జనార్ధన్ రెడ్డి, వైఎస్ చైర్మన్ శ్యామ్, కమిటీ సభ్యులను శాలువాతో సభ్యులను సిఈఓ వెంకట్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీహార్ యువకులు

**వెల్దండ, మే 6 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ ముందు టాటా ఏసీ వాహనం, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది వివరాలకు వెళితే బీహార్ రాష్ట్రానికి చెందిన షాబాద్, సాజిద్ నూర్‌అలాంలు బైక్ పై వస్తుండగా కల్వకుర్తి నుండివస్తున్న టాటా ఏసీ వాహనం ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన స్థలానికిపోలీసులు చేరుకొనిక్షతగాత్రులను 108ద్వారా కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడినయువకులు మండలంలోనికుప్పగండ్ల మసీదులో ఇమామ్‌గా పనిచేస్తారని సమాచారం.

## బాధ్యతలను స్వీకరించిన సహకార సంఘ పాలకవర్గ సభ్యులు

### పిఏసిఎస్ చైర్మన్ జంబుల హనుమంత్ రెడ్డికి ఘన సన్మానం

**లింగాల, మే6, ప్రభాతవార్త:** మండలంలోని అంబటిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు జంబుల హనుమంత్ రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు తిరిగి పదవి బాధ్యతలను బుధవారం స్వీకరించారు.19వ తేదీన సింగిల్ విండో పాలక వర్గన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసి ఇంఛార్జిలుగా నియమించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు.ఈ మేరకు విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం పాత పాలకవర్గాలను కొనసాగిస్తూ పదవి బాధ్యతలు అప్పగించాలని తీర్పు ఇచ్చింది. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు జిల్లా సహకార సంఘాధికారి ఆదేశాలకు అనుగుణంగా బుధవారం చైర్మన్ జంబుల హనుమంత్ రెడ్డి నేతృత్వంలోని పాలక వర్గ సభ్యులు బాధ్యతలను స్వీకరించారు. మరోసారి చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించడం పట్ల ఆనందంగా ఉందని పిఏసిఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జంబుల హనుమంత్ రెడ్డిని రైతులు, మాజీ సర్పంచ్ కోనేటి తిరుపతయ్య,పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు.



## విద్యుత్ ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యం

**బిజినపల్లి, మే6 ప్రభాతవార్త:** విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తలు విధిగా తీసుకొని ముందుకు సాగాలని,విద్యుత్ ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యమని విద్యుత్ ఎస్ఇ నర్సింహారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ భద్రత వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఇ నర్సింహారెడ్డి మాట్లాడుతూ లైన్ క్లియర్ పొందిన తర్వాతనే పని చేయాలన్నారు.హెల్మెట్, సేఫ్టీబెల్ట్ పెట్టుకుని పని చేయాలని సూచించారు. ప్రాణాలు కాపాడటంలో ఎర్తింగ్ అతి ముఖ్యమైనది. కనుక పని ప్రారంభించే ముందు ఎర్తింగ్ తప్పకుండా వాడాలన్నారు. పనిలో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ వాడకూడదని, మత్తు పదార్థములు సేవించొద్దన్నారు.నిర్ధారిత భద్రత పరికరాలను సక్ర మంగా వినియోగిస్తున్నారా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించారు. విద్యుత్‌లైన్ల నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టి వినియోగదారులకు అంతరాయ రహితంగా నాణ్యమైన విద్యుత్ ను సరఫరా అందించాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డిఈ శ్రీధర్ శెట్టి మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలు, రైతులకు విద్యుత్ భద్రతపై సమగ్ర అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశాలు, ప్రచార కార్యక్రమాలతో భద్రత ప్రమాణాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు.విద్యుత్ భద్రత అనేది కేవలంశాఖ బాధ్యత మాత్రమే కాదని అది ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. చిన్న నిరక్ష్యం కూడా తీవ్రమైన ప్రమాదాలకు దారి తీయవచ్చునన్నారు. విద్యుత్‌కు సంబంధించిన ఏ ప్రమాద సూచన గమనించినా ఆలస్యం చేయకుండా వెంటనేవిద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం రోజు 24 గంటలు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నంబర్ 1912కు వెంటనేసంప్రదించాలని వినియోగదారులకు తెలియ చెప్పాలన్నారు.ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు, ఉద్యోగులు జాగ్రత్తలపై ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో ఏడి ప్రవీణ్ కుమార్ ఏఈ శ్రీనివాస చారి సిబ్బంది శ్రీనివాస్, చారి పాల్గొన్నారు.



సిబ్బందికి విద్యుత్ రక్షణ పరికరాలు అందజేస్తున్న ఎస్ఇ నర్సింహారెడ్డి

## ప్రజలకు ఎల్పీజి గ్యాస్, పెట్రోలు,డీజిల్ కొరత నివారించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ

**కొల్లాపూర్,మే 6,ప్రభాతవార్త :** కొల్లాపూర్ మండల కేంద్రంలో ఎన్టీఆర్ చౌరస్తా దగ్గర బుధవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ బాల నరసింహ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజలకు నిత్యం ఉపయోగపడేటటువంటి గ్యాస్, డీజిల్, పెట్రోల్ ఈ భారత దేశంలో అధికంగా కొరత ఉన్నది ఈ కొరతను ఈ ప్రభుత్వం నివారించాలి. కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ ధరను అధికంగా పెంచడం జరిగింది. దీనివల్ల సామాన్యమైన ప్రజలు హోటల్లో భోజనం గాని టిఫిన్ గానీ చేయడానికి వెళితే హోటల్ యజమానులు గ్యాస్ ధర పెరగడంతో అదనపు భారాన్ని మోపుతూ ప్రజలకు ఇవ్వడం జరుగుతుంది. అదేవిధంగా దేశంలో పెట్రోల్ డీజిల్ అధిక కొరత ఉండడం చేత ఏపెట్రోల్ బంకు వెళ్లిన నో స్టాక్ బోర్డులు ప్రదర్శించడం జరుగుతుంది. దీనివల్ల అధికంగా రైతులు ఇబ్బంది పడడం జరుగుతుంది. రైతులు ఆరుకాలం పండించిన పంటను కోసుకోవడానికి హార్వెస్టర్లు అవసరమవుతున్నందు వలన డీజిల్ కొరత వల్ల సకాలంలో రైతులు పండించినటువంటి పంటను కోసుకోలేక పోతున్నారు ఒక తిక్కు వాతావరణం మార్పు వల్ల రైతుల పండించిన పంటలు అధికంగా నష్టపోవడం జరుగుతుంది. మరో విధంగా డీజిల్ కొరత వల్ల రైతులు పండించిన పంటను సకాలంలో కోసుకోలేకపోతున్నారు దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రభుత్వాలు ప్రజలకు ఉపయోగపడేటటువంటి గ్యాస్,డీజిల్, పెట్రోల్ కొరతనుత్వరలోనే పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నాం.అదేవిధంగా ప్రపంచంలో యుద్ధ వాతావరణం సృష్టించేటటువంటి అమెరికా దేశం ఏవిధంగా చెప్తే ఆ విధంగా అవలంబించే విధంగా భారత దేశ ప్రభుత్వం వ్యవహరిస్తుంది ప్రజలకు ఉపయోగపడేటటువంటి గ్యాస్, డీజిల్, పెట్రోల్ ముడి చమురు పదార్థాలను మీరు ఆ దేశంతో కొనుగోలు చేయకూడదు నేను చెప్పిన దేశంలోనే కొనుగోలు చేయాలనే విధంగా అమెరికా చెప్తే భారతదేశం ఆవిధంగా అవలంబించడం జరుగుతుంది.ఆ విధంగా చేయడం వల్ల అధిక ధరలు పెరిగి సామాన్య ప్రజల పైన అధిక భారాలు మోపడం జరుగుతుంది. భారత ప్రభుత్వం ఇప్పటివరకు జరుగుతున్నటువంటి యుద్ధాల పైన నోరు మెదపడం లేదు ఎందుకు నోరు విప్పడం లేదో ఈ భారత ప్రభుత్వం ఈ ప్రజానీకానికి సమాధానం చెప్పాలని సిపిఐ తరపున డిమాండ్ చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మలశివుడు,జిల్లా సమితి సభ్యుడు గుర్రం కురుమయ్య, పెంట్లవెల్లి మండల సహాయ కార్యదర్శి నిరంజన్ నాయుడు, పట్టణ కార్యదర్శి ఎండి యూసుఫ్, మండల నాయకులు జంగం శివుడు, చాపల శేఖర్, రమణ, నారాయణ, తిరుపతయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చౌరస్తాలో సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా

## ఒకే రోజు 13 ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ

### అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని

**మక్తల్ టౌన్, మే 6 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో 16వ వార్డులో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల జాతర సందడి నెలకొంది. బుధవారం ఒక్కరోజే ఏకంగా 13 ఇందిరమ్మ ఇండ్లకు స్థానిక వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వల్లంపల్లి లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ సలాం, వార్డ్ ఆఫీసర్ విష్ణు ముఖ్య నాయకులతో కలిసి భూమి పూజ చేసి ఇందిరమ్మ ఇండ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్కూరి పావని మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో నియోజకవర్గానికి ఏకంగా4వేల వరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, మక్తల్ పట్టణంలోని 16వ వార్డులో బుధవారం ఒక్కరోజే 13 ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఒక్క ఇంటికి ఉచితంగా ఐదులక్షల రూపాయలను మంజూరు చేస్తుందని అన్నారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే 16వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాన్ని స్థానిక వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం సరిగా అందుతుందా లేదా అని ఆరాతీశారు. దీంతోపాటు చిన్నారుల ఎదుగుదల సరిగా ఉందా లేదా, వయసుకు తగినబరువు ఉన్నారాలేదాఅని పరిశీలించారు. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో రామ్ నారాయణ, మహమ్మద్ రంజాన్,ఆనంపల్లి రమేష్, వల్లంపల్లి ప్రవీణ్ కుమార్, దామరగిద్ద రాము, అమ్రేష్, కడే చూర్ రాజేష్, నీలి సంతోష్‌కుమార్,ఇందిరమ్మ లబ్ధిదారులుతదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న వార్డు కౌన్సిలర్ అల్కూరి పావని

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

**బిజినేపల్లి, మే6 ప్రభాతవార్త:** ప్రస్తుత సమాజంలో మానవులుగా జన్మించిన ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి అన్నారు. బిజినేపల్లి తాండలో శ్రీశ్రీశ్రీ వినాయక, శివాలయ, నంది, హనుమాన్ దేవాలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవంతుడి సేవ చేయాలని, తద్వారా మోక్షం లభిస్తుందని వివరించారు. దైనందిన జీవితంలో ప్రార్థన, యోగా, ధ్యానం, లేదా సత్సాంగత్యం ద్వారా ఆధ్యాత్మికతను అలవర్చు కోవడం వల్ల ఉన్నతమైన జీవితాన్ని, భగవంతునితో అనుసంధా నాన్ని పొందవచ్చు అని తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షే మం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింత నమానసిక ప్రశాంతతను, ఒత్తిడి నుండి విముక్తిని కలిగిస్తూ, జీవితంలో ధర్మబద్ధమైన మార్గంలో నడవడానికి సహాయపడు తుంది అని వివరించారు. నూతన ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఆలయ కమిటీ తరఫున ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందిర, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, మహేష్ యాదవ్, వెంకటస్వామి, తిరుపతయ్య, రాజు, లక్ష్మణ్ నాయక్ నరేందర్ గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, పులేందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి



## మార్కెట్ యార్డులో అంబలి కేంద్రం ప్రారంభం

**వనపర్తి, మే6, ప్రభాతవార్త :** వరి కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డులో వచ్చే రైతులకు తాగు నీరు, కనీస మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం చిట్యాల మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన అంబలి, తాగునీరు కేంద్రాన్ని వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. వచ్చిన రైతులకు రాగి అంబలి,మంచినీరును అందించారు. మిగిలిన అన్ని కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లోనూ రైతులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**గద్వాల మే 6,ప్రభాతవార్త:**జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లో కలెక్టర్ సంతకాలుచేశారు.ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవ వేడుకలు

**ఆత్మకూర్ మే 6, ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని ఆరేపల్లి గ్రామంలో బుధవారం రోజు ఆంజనేయ స్వామి మరియు శివాలయం 14వ వార్షికోత్సవ వేడుకలను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ సమీపంలోని కృష్ణానది ఒడ్డు తీరాన ప్రతిష్టించినటువంటి ఆంజనేయస్వామి శివాలయం దేవాలయ 14వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఉదయం 6గంటల నుంచి గణపతి హోమం మరియు అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలతో ప్రత్యేక పూజలునిర్వహించి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామచంద్రయ్య మాజీసర్పంచ్ శ్రీత యుగంధర్ రెడ్డి గ్రామ ప్రముఖులు నరేష్,ఏటి కాడిమోహన్,ప్లాంట్ శ్రీనివాసులు తదితరులతో పాటుగాపలువురు గ్రామస్తులుభక్తులుఅధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యుపియస్సి సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**గద్వాల మే 6,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్ష 2027 కోసం మైనారిటీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 100 మంది మైనారిటీ అభ్యర్థులను ఎంపిక చేసి డిజిటల్ తరగతిగది, ప్రఖ్యాతా అధ్యాపకులు గ్రంథాలయం ఇంటర్నెట్, వైఫై సౌకర్యంతో (యూపీఎస్సీ సిఎస్సి 27) సమగ్ర శిక్షణను అందించనున్నారు.ఈ శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు33.33% అన్ని రిజర్వ్ కేటగిరీలలో వికలాంగులకు 5 సీట్లు కేటాయించటం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయము రూ.5 లక్షలు మించకూడదు. అభ్యర్థుల ఎంపిక కోసం 14 జూన్ 2026న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం12.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల నందు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించబడుతుంది. అభ్యర్థులు వెబ్ సైట్ ద్వారా ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన ఆసక్తి కలిగిన మైనారిటీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ప్రకటన ద్వారా కోరారు.మరిన్ని వివరాల కోసం 04023236112 నంబర్ లేదా ద్వారా సంప్రదించవలెనని సూచించారు.

## ఘనంగా బీరప్ప స్వామి ధ్వజస్తంభ ప్రతిష్టాపన

**వెల్దండ, మే 6 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో కురుమ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీబీరప్ప స్వామి కామరతి అక్క మహంకాళి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు ఈనెల 4వ తేదీన ప్రారంభమై ఈ నేల12వ తేదీన పూజా కార్యక్రమాలు ముగియనున్నాయి. బుధవారం వేద పండితులచే గర్తన్యాస, రత్న న్యాస, బీజాన్యాస, దాతున్యాస యంత్ర స్థాపన మహా పూర్ణాహుతి కలశమార్జన,మహా దాసిర్వచనం, ధ్వజస్తంభ ప్రతిష్టాపన హోమాలు పూజలను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిందం లక్ష్మి కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ లలితా తాంబాల్,వార్డు సభ్యులురమేష్, రామకృష్ణ రాములు, సత్య నారాయణ, శ్రీశైలం, జంగయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యుత్ అంశంపై రైతు వారోత్సవాలు

**వెల్దండ, మే 6 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద 99రోజుల ప్రణాళిక కార్యాచరణలో భాగంగా వ్యవసాయ క్షేత్రలు సౌర విద్యుత్ కేంద్రాల అంశంపై గురువారం రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఏఈ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు వేదిక వద్ద నిర్వహించే కార్యక్రమానికి పెద్దఎత్తున మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచ్లు, వార్డుసభ్యులు, రైతుసంఘాల నాయకులు, రైతులు తప్పకుండా కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలన్నారు.

## చెక్ పోస్టును తనిఖీ చేసిన సీఐ

**వెల్దండ, మే 6 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై గల కోట్ర జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన పోలీస్ చెక్ పోస్టను సీఐ రఘువీర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ వరకుచెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఆవులు కళేబారాలకు తరలకుండా కట్టుదిట్టంగా 24 గంటలు తనిఖీలు చేపడుతున్నామన్నారు.ఎవరైనా ఆవులను కళేబారాలకు తరలించినట్లయితే అట్టి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ పద్మమ్మ కృష్ణయ్య

**కొల్లాపూర్,మే 6 ప్రభాతవార్త :** పెంట్లవెల్లి మండల కేంద్రంలోని జటప్రోలు గ్రామంలోనీ రైస్ మిల్లు దగ్గర ఐకెపి వరి కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ పద్మమ్మ కృష్ణయ్య,మాజీ వైస్ ఎంపిపి భీం రెడ్డి, ముఖ్యనాయకులు నాగిరెడ్డి,బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పండించిన ప్రతి గింజకూగిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులు దళారులను ,మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా,నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను అమ్ముకోవాలని సూచించారు. దీనివల్ల రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు.వరి ధాన్యం నాణ్యతకు తగ్గట్లుగా మ్యాచార్ ఉండాలని ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమయానికి కాంటా పూర్తయ్యేలా చూడాలని పెంట్లవెల్లి మండల మహిళా సంఘాల ఏపీయం, సిసి, బుక్ కీపర్,మహిళా సంఘాల సభ్యులను కోరారు.ఏపీయం, సిసీ,బుక్ కీపర్,ఐకెపి గ్రామమహిళా సంఘాలసభ్యులు,వార్డుసభ్యులు,రైతులుహమాలీలు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

◆ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, మే 6 (ప్రభాతవార్త):** కల్వకుర్తి మండల పరిధిలోని యంగంపల్లి రోడ్డులోగల కాటన్ మిల్లు వద్ద ఉన్న జిన్నింగ్ మిల్లులో మొక్క జొన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకున్న కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి బుధవారం సాయంత్రం నేరుగా జిన్నింగ్ మిల్లు వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న గోదాంలను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా మొక్కలను కొనుగోలు చేయాలని జిల్లా అధికారులను ఎమ్మెల్యే ఫోన్‌లో ఆదేశించారు. రైతులెవ్వరు కూడా అధైర్యపడవద్దని, మీరు తీసుకొచ్చిన ప్రతి మొక్కజొన్న గింజను మిల్లు యాజమాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, హరిశ్వర్‌రెడ్డి, సీఐ నాగార్జున తదితరులు ఉన్నారు.

# నూతన పాలకవర్గ సభ్యులకు సన్మానం



నూతన పాలకవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

**మదనాపురం, మే6 (ప్రభాతవార్త):** చిన్న చింతకుంట మండలంలోని దమగ్నాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో శ్రీకురుమూర్తి స్వామి దేవస్థాన నూతన పాలకవర్గ చైర్మన్ బత్తుల బాలరాజు, సభ్యులు కొత్తపల్లి ఈట మహేందర్, కొన్నూరు భాస్కరాచారి, వారిని మండల కాంగ్రెస్ పార్టీ,మాజీ ఎంపీపీ మహదేవ్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ కార్యదర్శి అంజద్‌అలీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన పాలక మండలి చైర్మన్ సభ్యులను శాలువాతో సత్కరించారు. దేవస్థాన నూతన పాలకవర్గ సభ్యులుగా ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డికి నూతన పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలుతెలిపారు. నూతన పాలకమండలి సభ్యులు ఆధ్యాత్మిక చింతనతో పనిచేయాలని శ్రీకురుమూర్తిస్వామి దేవస్థాన ప్రతిష్టకు భంగం కలిగించకుండా పనిచేయాలని నూతన పాలక మండలి సభ్యులను వారు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నారాయణ నాయక్, సీతారాం నాయక్, మాజీ సర్పంచ్ బిట్లీ శ్రీనివాస్ యాదవ్, దేవరకద్ర నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్, నాయకులు ఎర్ర నాగన్న, దావీదు, బ్రహ్మయ్య ఆచారి, పాషా, తిరుమలేష్, రవికుమార్ రెడ్డి, రాజకుమార్, మొగులయ్య, మాసిరెడ్డి, బాలకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ విండో చైర్మన్‌గా ఎల్. శ్రీనివాస్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



సింగిల్ విండో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎల్. శ్రీనివాస్ రెడ్డి

**నర్వ,మే6 (ప్రభాతవార్త):** తెలంగాణ హైకోర్టుఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో చైర్మన్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు నర్వ మండల సింగిల్ విండో అధ్యక్షుడు లంకాల శ్రీనివాస్ రెడ్డి బుధవారం సింగిల్ విండో చైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు. అలాగే వైస్ చైర్మెన్ లక్ష్మణ్ తో పాటు పాలకవర్గ సభ్యులు కొలువుదీరారు. ఈ మేరకు పిఎసిఎస్ కార్యాలయంలో కార్యదర్శి ఉదయ్ కుమార్, డిసీసీ సిబ్బంది చేతుల మీదుగాసింగిల్ విండో చైర్మన్‌గా ధ్రువపత్రం అందుకున్నారు. చైర్మెన్, వైస్ చైర్మన్ తోపాటు కొలువుదీరిన పాలకవర్గానికి మండల ప్రజలు,రైతులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం యాసంగి వరి కొనుగోళ్లతో పాటు మక్కల కొనుగోలు ప్రక్రియ జరుగుతుందన్నారు. కొనుగోళ్లలోఎలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండాగన్నీ బ్యాగులను అందించడంతోపాటు,వడ్లను తరలించేందుకు లారీలను కూడా త్వరగా పంపించే విధంగా చూస్తామన్నారు.

# జోగులాంబ గద్వాల వాసులకు దక్కిన నామినేటెడ్ పదవులు

◆ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ చైర్మన్‌గా కొల్లె సరిత

◆ వాల్మీకి బోయ సహకార కార్పొరేషన్ చైర్మన్‌గా గట్టు తిమ్మప్ప



సరిత తిరుపతయ్య



గట్టు తిమ్మప్ప

**గద్వాల మే 6,(ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి రేవంత్‌రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం 17 కార్పొరేషన్లకు చైర్మన్లతో పాటు వైస్ చైర్మన్లను నియమించింది. తెలంగాణ లోనామినేటెడ్ పదవులను భర్తీ చేశారు. వివరాలను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ ప్రకటించారు.అందులో గద్వాల జిల్లాకు రెండు చైర్మన్ పదవులు దక్కాయి. గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ చైర్మన్‌గా కొల్లె సరిత, వాల్మీకి బోయ సహకార కార్పొరేషన్ చైర్మన్‌గా గట్టు తిమ్మప్పలను నియమించింది. ఈ సందర్భంగా వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# బిఆర్ఎస్ పార్టీలో చేరిన గద్దె గూడెం నవీన్ కుమార్

పార్టీ కండువా వేసి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి

**కోయిలకొండ మే 6,(ప్రభాతవార్త):** మండల కేంద్రమైన కోయిలకొండకు చెందిన యువనాయకుడు గద్దె గూడెం నవీన్ కుమార్ నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన గద్దె గూడెం నవీన్ కుమార్ కు మాజీ ఎమ్మెల్యే గులాబి పార్టీ కండువా వేసి బీఆర్ఎస్ పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గద్దె గూడెం నవీన్ కుమార్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఎస్‌రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా పార్టీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇకనుంచి బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలోమాజీ ఎమ్మెల్యే సోదరుడు, నారాయణపేట నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ సమన్వయకర్త ఎస్ రవీందర్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బికృష్ణ, మాజీజెడ్పిటిసి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మోదీపూర్ రవి, భీమ్ రెడ్డి, మల్లయ్య యాదవ్, గుమ్మడి రాజ్‌కుమార్, షమీం,లక్ష్మీనారాయణ గౌడ్,, పానుగంటి నగేష్, ఏ రమేష్, బి శేఖర్, వడన్న తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన యువ నాయకుడు గద్దె గూడెం నవీన్

# జడ్చర్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

■ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ■ కౌన్సిలర్లను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే





మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, మే 6, (ప్రభాతవార్త):** జడ్చర్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చారు. జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ పాలకమండలి వీడ్కోలు సమావేశంలో శాసనసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేసిన పాలకమండలి సభ్యుల సేవలను ఎమ్మెల్యే అభినందించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సి లర్లను ప్రత్యేకంగా సన్మానించి, వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేసి, భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు. పట్టణ అభివృద్ధి కోసంఅందరూ కలిసికట్టుగా పనిచేసిన విధానం అభి నందనీయమని ఎమ్మెల్యేపేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పనులు నాణ్యతగా చేపట్టాలి : ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

■ 16వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**జడ్చర్ల, మే 6, (ప్రభాతవార్త):** రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని 16వ వార్డులో నూతనంగా50 లక్షల నిధులతో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్ నిర్మాణానికి బుధవారం ఆయన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్ప లత నర్సింలు, వైస్ చైర్ పర్సన్ సారిక రామ్మోహన్, కౌన్సిలర్లు చైతన్య చౌహాన్,రమేష్, రాజు, నాయకులు అల్వాల్ రెడ్డి, ప్రజాప్రతి నిధులు, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వద్దు

# ఐకెపి కేంద్రం వద్ద డిసిసి చీఫ్, శివసేన రెడ్డికి రైతులు మొర

■ రైతుల కోసం వెంటనే స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారం

■ అధికారులంతా చిత్తశుద్ధితో పని చేయాలి

■ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దు

■ వనపర్తి జిల్లా డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి

**వనపర్తి, మే6, (ప్రభాతవార్త):** ప్రజాపాలన ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తుందని, రైతులకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవలసిన బాధ్యత అధికారులకు ఉందని, వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటుధరకే కొనుగోలు చేయాలని డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో ఐకెపి సెంటర్లు ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు పిలవడంతో ఆయన సందర్శించారు. ఐకెపి సెంటర్లు నిర్వహణ తీరును పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఐకెపి, మెప్మా, కొనుగోలు కేంద్రాలవద్ద రైతులుఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే దళారులు తరువు పేరుతో రైతులను మోసం చేస్తున్నారని రైతులు విన్నవించడంతో వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో చరవాణిలో మాట్లాడి పలు సమస్యలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చిన్నచిన్న పొరపాట్లు ఉంటే వెంటనే సరి చేయాలనిఅధికారులకు సూచించారు.ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురాకుండా పనిచేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, టెంటు, తేమ శాతానికి సంబంధించిన పరికరాలు, వర్షం వస్తే ధాన్యం తడవకుండా ముందస్తు ప్రణాళికలతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట ఆ గ్రామ సర్పంచ్ పుష్పలత శివకుమార్, ఉపసర్పంచ్ పోల్లికమ్మ, రైతులు, పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# రైతుల గోస ప్రభుత్వానికి పట్టదా..?

## రైతుల పట్ల నిర్లక్ష్యం ఎందుకు? : బిజెపి నాయకులు



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**మదనాపురం, మే 6 (ప్రభాతవార్త):** రైతులగోస ప్రభుత్వానికి పట్టదా ప్రభుత్వ అధికారులు రైతుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని బిజెపి మండల అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రం మార్కెట్ యార్డులో నాయకులతో కలిసి సందర్శించి రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని అన్నారు. ధాన్యం తూకం చేసి రెండు వారాలైన మిల్లుకు తరలించకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. లారీలు రాలేదని ఆలస్యం చేస్తున్నారన్నారు. ఆ ధాన్యాన్ని మిల్లులకు షార్టెజ్ రూపంలో రైతుల పొట్ట కొట్టడం జరుగుతుందన్నారు. ధాన్యం తూకం చేసిన 48 గంటల్లో రైతు అకౌంట్లో డబ్బులు వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వేడి గాలులు వర్షం వచ్చే పరిస్థితులు అవకాశాలు ఎక్కువగాఉన్నాయని, ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని తరలించాలని ఆయన కోరారు. జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దొందు దొందే అన్నారు. ఈ పార్టీ నాయకులు ఒకరిపై ఒకరి చిందులు వేయడం తప్ప రైతులకు మేలు చేయడం లేదని అన్నారు. రైతుల ఉసురు మంచిది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల అధ్యక్షుడు కృష్ణ యాదవ్,బిజెపి నాయకులు కొండ వెంకటేశ్వర్లు శెట్టి, బిట్టి రాజశేఖర్, బాబు గౌడ్, అమర్నాథ్ శెట్టి, హోటల్ శ్రీను, తిరుమలాయపల్లి శీను,రైతులు మహిళలు పాల్గొన్నారు.

# పటిష్టమైన భద్రతా వ్యవస్థ అవసరం

మొదటి పేజీ తరువాయి భాగం..

భద్రత కోసం పటిష్టమైన ఏర్పాట్లు అత్యవసరమని తెలిపారు. ప్రతి షాప్‌లో నాణ్యమైన సీసీ కెమెరాలు, నైట్ విజన్ కెమెరాలు ఏర్పాటు చేసి24 గంటల పర్యవేక్షణ ఉండేలా చూడాలని సూచించారు. కెమెరాల ఫుటేజ్‌ను నిర్దిష్ట కాలం వరకు భద్రపరచడం, షాప్ ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు స్పష్టంగా కవరయ్యేలా ఏర్పాటు చేయడం కీలకమని పేర్కొన్నారు. అదేవిధంగా అలారం సిస్టమ్స్, సురక్షిత లాకర్లు వంటి భద్రతా ఏర్పాట్లతో పాటు మొబైల్ అలర్ట్ సిస్టమ్స్, యాక్సెస్ కంట్రోల్ వంటి ఆధునిక భద్రతా సాంకేతికతలను కూడా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే జిల్లా పోలీస్ అధికారులకు బంగారు షాపులు ఉన్న ప్రాంతాలలో గస్తీని మరింత బలోపేతం చేయాలని, నిరంతరం మొబైల్ పార్టీలు తిరుగుతూ పర్యవేక్షణ నిర్వహించాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.అలాగే సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగాఉండాలని హెచ్చరిస్తూ, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆన్‌లైన్ యాత్ర/టికెట్ బుకింగ్ మోసాలు, ఫేక్‌కాల్స్,మెసేజెస్ ద్వారా డబ్బులు మోసగించే ఘటనలు పెరుగుతున్నాయని చెప్పారు. తెలియని లింకులుక్లిక్ చేయకుండా, అనుమానాస్పద కాల్స్‌కు స్పందించకుండా, వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు.

ఏవైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. రోడ్డు భద్రతకూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, స్వీయ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రజా భద్రతే మా ధ్యేయం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ పోలీసులతో సమన్వయం కలిగివనిచేయాలని ఎస్పీకోరారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్‌పెక్టర్ ఇజాజుద్దీన్, బులియన్ మార్కెట్ అధ్యక్షుడు, స్వర్ణకారులు సంఘం అధ్యక్షుడు, బంగారు దుకాణాల యజమానులు, స్వర్ణకారులు పాల్గొన్నారు.

# ప్రభంజనమై తరలుదాం

మొదటి పేజీ తరువాయి భాగం..

సమీకరణ చేయాలని బాధ్యులకు జిల్లా ఇంచార్జి కొమరయ్య దిశానిర్దేశం చేశారు.మూడోసారి ప్రధానిఅయిన తర్వాత మోదీ తెలంగాణకు తొలిసారి వస్తున్నారని, ఆ మహానాయకుడికి మనమంతా సాధర స్వాగతం పలకాల్సిన అవసరం అవశ్యకత ఎంతైనా ఉన్నదని పేర్కొన్నారు. ఇటీవల 5 రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే 3 రాష్ట్రాల ప్రజలు బిజెపికి పట్టం కట్టారని, ముఖ్యంగా వెస్ట్ బెంగాల్‌లో గెలవడం అనేది మాములు విషయం కాదన్నారు.హిందూ వ్యతిరేఖ విధానాలకు తెర తీసిన మమతా బెనర్జి కీ ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. 2047 వరకు వికసిత్ భరత్ కావాలంటే ఇలాంటి విజయాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. అందులో తెలంగాణ కూడా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు ఊరికనే బిజెపి కీ అధికారం ఇవ్వడం లేదని, 12 ఏళ్లలో కేంద్రంలో నాన్ కరప్షన్, గుడ్ గవర్నన్స్ రూలింగ్, డెవలప్మెంట్ విజన్ తో ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు.ఇక్కడ అంటే తెలంగాణాలో కూడా అలాంటి పాలన రావాల్సిందే అన్నారు. ఇక్కడ కాంగ్రెస్, బిఆర్ఎస్ మోసపూరిత పాలన చూసామని, ఇక్కడ ఆ రెండు పార్టీలకు కాలం చెల్లిందన్నారు. అందుకే మనమంతా కోపరేషన్ కోఆర్డినేషన్స్ తో పని చేసి తెలంగాణలో మోదీ పర్యటనను సక్సెస్ చేయాలని, బూత్ వైస్, మండలాల వారీగా జిల్లా వారీగా లిస్ట్ తయారు చేసుకొని ప్లాన్ చేసుకోవాలని కోరారు. జిల్లా స్థాయి నేతలతో కోర్డినేట్ చేసుకొని జన సమీకరణ చేసుకోవాలన్నారు. బస్సులు, ట్రైన్ సౌకర్యాలను సమన్వయం చేసుకొని భారీగా జనం తరలి వచ్చేలా ప్లాన్ చేసుకోవాలని సూచించారు.తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడంలో బిజెపి మీడియా కూడా కీలక పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మజా రెడ్డి, నాయకులు అచ్చుగట్ల అంజయ్య, పవన్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బాలకృష్ణ, ఎస్సీ మోర్చా నాయకుడు కొంగలి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




శిక్షణ పొందుతున్న మహిళలు

# మహిళలు ఆర్థికంగా బలపడితేనే అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి భాగం..

ప్రారంభమని,ఈ మూడు నెలల కోర్సు తర్వాత కూడా అడ్వాన్స్ స్థాయికి చేరేందుకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా, త్వరలోనే వీరన్నపేట ప్రాంతంలో మరో శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ కేంద్రం రాబోయే 2-3 నెలల్లో పూర్తి చేసి అక్కడ కూడా మహిళలకు శిక్షణ అందించే కార్యక్రమం ప్రారంభిస్తామని చెప్పారు. మహిళా శక్తిని ప్రోత్సహిస్తూ వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మహిళలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ఇంచార్జి నిజలింగప్ప, సెట్విన్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమంలో సహకార సంఘాల పాత్ర కీలకం

మొదటి పేజీ తరువాయి భాగం..



సమావేశానికి హాజరైన రైతులు

ఎదగవచ్చన్నారు. ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి రుణమాఫీ, రైతు భరోసా, బీమావంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. గద్వాల పిఎసిఎస్ ఉత్పత్తిదారుల సహకార సంఘంకు ఎంపికవడంతో ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రూ.15 లక్షలు మంజూరవడంతో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా నేల ఆరోగ్యాన్ని కాపాడతామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పిఎసిఎస్ చైర్మన్‌సుభాన్, గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, జిల్లా కోపరేటివ్ అధికారి శ్రీనివాస్, వ్యవసాయశాఖ అధికారి వీరప్ప,ఎల్డిఎం శ్రీనివాస రావు, కోపరేటివ్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్ కుమార్, పిఎసిఎస్ సీఈవో వెంకటేశ్వర్ రెడ్డి, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# లారీ ,డీసీఎం, బస్సు ఢీకొని వ్యక్తి మృతి,పలువురికి గాయాలు

మొదటి పేజీ తరువాయి భాగం..

వెళ్తున్న లారీ డీసీఎంను అతివేగంగా వెనుక నుంచి ఢీకొనడంతో రాయిచూర్ నుండి హైదరాబాద్‌కు వస్తున్న పెళ్లి బస్సును ఎదురుగా ఢీకొంది. దీనితో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరికి,డీసీఎం డ్రైవర్‌కు గాయాలయాయి.లారీ డీసీఎం వాహనాలు రోడ్డుపై బోల్తాపడ్డాయి. లారీ డ్రైవర్ గందె భాస్కర్‌గౌడ్ తీవ్ర గాయాలతో లారీలో ఇరుక్కుపోయాడు. వెంటనే స్పందించిన దేవరకద్ర పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని లారీలో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్ పాలకొండపల్లి, షాద్‌నగర్ కు చెందిన లారీ డ్రైవర్ గందె భాస్కర్ గౌడ్ 44 సంవత్సరాల గల వ్యక్తి నీ బయటకు తీసి చికిత్సనిమిత్తం పైలెట్ షకీల్ అహ్మద్, దేవరకద్ర 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి చెందాడని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దేవరకద్ర ఎస్సై నాగన్న తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన మంత్రి వాకిటి శ్రీహరి...అదే సమయం లో మక్తల్ కి వెళ్తున్న పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రివాకిటి శ్రీహరి సంఘటన స్థలాన్ని పరిశీలించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా సిగ్నల్స్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి జన్మదినోత్సవం

**నారాయణపేట, మే6 (ప్రభాతవార్త):** జిల్లా కేంద్రంలో మాజీ శాసనసభ్యులు ఎస్. రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు విజయ్ సాగర్ ఆధ్వర్యంలో తఖి బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, రాజేందర్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అలాగే గొడుగు గేరిలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాజేందర్‌రెడ్డిని గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలను కొనసాగించగా, సత్యనారాయణ చౌరస్తాలో అల్పాహార వితరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భరత్, నారాయణమ్మ, చెన్నారెడ్డి, కన్నా జగదీష్, ప్రతాప్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, స్టాంపు రాంరెడ్డి, బుల్లెట్ రాజు,మైనార్టీ నాయకులు సలీం అడ్వకేట్, మహమూద్ అన్సారి, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడ,మే6 (ప్రభాతవార్త):** మండలాలలో నారాయణపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీఅధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి జన్మదినాన్ని ధన్వాడ, మరికల్ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ధన్వాడలో కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో డి.సుధీర్ కుమార్ రావు, గౌని శ్రీనివాస్, ధన్వాడ టౌన్ ప్రెసిడెంట్ మల్లేష్, గౌడ్ శేఖర్, జుట్ల సత్యనారాయణ గౌడ్, ఎండి వహీద్, జి.బాలయ్య, వడ్ల శాంతి కుమార్ తాజుద్దీన్, నాసర్, రఫీ,ఇర్ఫాన్, కురువ నవీన్, షఫీ దీన్, శ్రీనివాస్ గౌడ్, ఆంజనేయులు, రాజేందర్ రెడ్డి,వల్యానాయక, రమణనాయక్ తదితరబీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇక మరికల్ మండల కేంద్రంలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, జనహృదయ నేతగా పేరొందిన ఎస్. రాజేందర్ రెడ్డికి యువ నాయకులు రవి గౌడ్, గూప నర్సిములు, కోయిలకొండ రఘు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో ప్రజాసేవ మరింత విస్తరించాలని, జిల్లాకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు.

**కోయిలకొండ మే6, (ప్రభాతవార్త):** ప్రజా నాయకుడు మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని శేరి వెంకటాపూర్ గ్రామంలో పార్టీ నేతలు, అభిమానుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి భారీ కేకును కట్ చేయడంతో స్వీట్లు పంచుకొని పార్టీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే ను కలుసుకొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ ప్రతినిధులు,నేతలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.కోయిలకొండ మండలాన్ని ఎంతో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే కే దక్కిందన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన పార్టీ నేతలను ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సోదరుడు బి ఆర్ఎస్ పార్టీ నారాయణపేట నియోజకవర్గ సమన్వయకర్త ఎస్ రవీందర్ రెడ్డి, మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు బి కృష్ణ, నాయకులు బచ్చిరెడ్డి, మోదీపూర్ రవి, భీమ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మాజీ సింగిల్విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రాజ వర్ధన్ రెడ్డి, సర్పంచులు నాగయ్య, వాసు, హరి సింగ్ నాయక్, రాజేశ్వర్, నాయకులు గుమ్మడి రాజకుమార్, పి నగేష్, షమీం, లక్ష్మీనారాయణ గౌడ్ , జమాల్ పూర్ కృష్ణయ్య గౌడ్, శివ, గోవర్ధన్‌గౌడ్, ఇతరులు పాల్గొన్నారు.




కేకును కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి



మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నాయకులు



ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు